క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ప్రకాష్ నగర్, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, కృష్ణ ఆర్థోపెడిక్ హాస్పిటల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

సీఐటీయూ నాయకుల నిరసన

ప్రకాశం నగర్: వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు బి.పవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. పవన్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, టైం కంటింజెంట్, పార్ట్ టైమ్, గెస్ట్, పీస్ రేట్, గౌరవ వేతనం తదితర నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులలో సమానంగా వేతనం, సౌకర్యాలు అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో డీవైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు, ప్రజా సంఘాల నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత ప్రకాష్ మృతి


పిల్లా సూర్య ప్రకాశరావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్మిక నాయకుడు పిల్లా సూర్యప్రకాశరావు (ఫోర్ ప్రకాష్)(62) రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బొమ్మూరులోని పిల్లా సూర్యప్రకాశరావు పార్థివదేహాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కందుల దుర్గేష్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, ఆకుల చక్రవర్తి, కొమ్ములసాయి, కేఆర్ రాజేష్,రామినీడి మురళి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు పిల్లా బాబి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

డీపీవో శ్రీనివాసరావుకు అభినందనలు


డీపీవో శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఈవో పీఆర్అండ్ఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన బి.శ్రీనివాసరావును రూరల్ మండల ఈవోపీఆర్అండ్ఆర్డీ డి.బాబూరావు, పంచాయతీ కార్యదర్శులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. డీపీవో కార్యాలయ పరిపాలనాధికారి జగదీశ్వరి, పంచాయతీ కార్యదర్శులు ఎం.రూప్‌చంద్, గుంట్రు వెంకటరావు, ఎస్.శ్రీనివాసరెడ్డి, టి.కృష్ణ, కె.హనుమంతరావు, గుత్తుల కాశీవిశ్వనాథ్, చెరుకూరి రాణి పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో మహాసభ


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అరుణ్

ధవళేశ్వరం: గ్రామంలోని సీఐటీయూ కార్యాలయంలో దడాల శేషారావు అధ్యక్షతన సోమవారం మహాసభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా ఆలిండియా ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పనిచేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో కర్రి రామకృష్ణను తిరిగి కార్యదర్శిగా, దడాల శేషారావును సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో చాలామందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, వారందరికీ తక్షణమే స్థలాలను చూపించాలని, గతంలో ఇచ్చిన పట్టాలున్న గృహాలన్నింటినీ ఫ్రీ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం చేయించాలని, పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుపరచాలని తీర్మానించారు.

భయం వీడి.. బతుకు పయనం

- వీడుతున్న చిరుత భయం
- పనుల్లో నిమగ్నమవుతున్న జనం


బుర్రిలంక ప్రాంతంలో చిరుత తిరిగిన ప్రదేశంలో మేస్తున్న మేకలు

కడియం: చిరుత భయం ప్రజలను క్రమంగా వీడుతోంది. ఐదు రోజులుగా నెలకొన్న భయాందోళన నుంచి కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక వాసులు సాధారణ జీవనంలోకి వస్తున్నారు. ఈ నెల 24వ తేదీన చిరుత ఆనవాళ్లను అటవీశాఖాధికారులు గుర్తించారు. దీంతో అప్పటి నుంచి 27వ తేదీ వరకు జనజీవనం స్తంభించింది. సాధారణంగా ఇక్కడ నిత్యం నర్సరీ మొక్కల ఎగుమతులు, వివిధ రకాల పనులతో కూలీలు సందడిగా కన్పిస్తుంటారు. చిరుతపులి సంచారంపై సమాచారం వెలువడడంతో ఒక్కసారిగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మొక్కల ఎగుమతులను కూడా నిలిపివేశారు. దీంతో మూడు రోజుల పాటు నర్సరీల్లో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. అయితే 26వ తేదీ రాత్రి నుంచి పులిజాడ కానరాలేదు.

తీవ్ర ప్రయత్నాలు

చిరుతను బంధించేందుకు అటవీశాఖ సిబ్బంది విస్తృతంగా ప్రయత్నాలు చేశారు. కానీ ఫలితం లేకుండా పోయింది. 27వ తేదీ నుంచి మూడు రోజులుగా చిరుతజాడ ఎక్కడా కనిపించలేదు. చిరుత పాదముద్రలు లభించిన మూడు రోజులు వాతావరణం కూడా అనుకూలించలేదు. ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో తీవ్ర వర్షపాతం నమోదైంది. దీంతో చిరుత కదలికలు ఎటువైపు సాగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. 27వ తేదీ తరువాత నుంచి వర్షం పడకపోవడంతో చిరుత ఆనవాళ్లు లభిస్తాయన్న ఆశాభావం సర్వత్రా వ్యక్తమైంది. కానీ అందుకు భిన్నంగా సోమవారం నాటికి కూడా చిరుత ఎక్కడ ఉందన్నది తేలలేదు.

బోన్లు, ట్రాప్ కెమెరాలు అక్కడే..

బుర్రిలంకలోని నర్సరీల్లో ఏర్పాటు చేసిన బోన్లు, ట్రాప్ కెమెరాలు, ఇతర సామగ్రిని అటవీశాఖ అధికారులు అలాగే ఉంచారు. మరో చోట ఎక్కడైనా చిరుత కదలికలు నమోదయ్యేంత వరకు వీటిని ఇలాగే ఉంచుతామని సంబంధిత సిబ్బంది స్పష్టం చేశారు. చిరుత బారిన పడకుండా స్థానికులు తగు జాగ్రత్తలు వహించాలని వివిధ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు రావులపాలెంలో చిరుత ఆనవాళ్లు లభించాయన్నది కూడా వదంతులేనన్నది అటవీశాఖ సిబ్బంది తేల్చారు.

పులసల్లంకకు వెళ్లిందా..

అసలు చిరుత ఎటువైపు ప్రయాణం సాగిస్తోందన్న దానిపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.సాధారణంగా అటవీ మృగాలు జనజీవనానికి దూరంగా, తగిన ఆహారం, మదుగు ఉన్న ప్రదేశాలను ఎంచుకుంటాయని చెబుతున్నారు. ప్రస్తుతం కడియపులంక పంచాయతీ పరిధిలో అటువంటి అవకాశాలు ఉన్న ప్రదేశం గోదావరిలోని పులసల్లంకగా భావిస్తున్నారు. వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ లంక ప్రాంతంలో వివిధ రకాల చెట్లు, పొదలతో పాటు, వివిధ రకాల పంటలను కూడా రైతులు సాగు చేస్తున్నారు. అంతే కాకుండా లంక ప్రాంతంలో జింకల సంతతి ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. చిరుతకు తగినంత ఆహారంగా ఈ జింకలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరుత ఈ ప్రాంతానికి పయనిస్తుందన్న భావన బలంగా విన్పిస్తోంది.

బదులు లేని ప్రశ్నలు

నిజానికి చిరుత కనిపించిన బుర్రిలంకలోని నర్సరీల చుట్టూ జనజీవనం ఎక్కువగా ఉంటుంది. ప్రతి రోజూ వివిధ రకాల వాహనాలు, వందల మంది కూలీలు తిరుగుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో చిరుతకు తగిన ప్రాంతంగా పులసల్లంకే కావొచ్చన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. అసలు బుర్రిలంక ప్రాంతానికి చిరుత ఎలా వచ్చింది, ఒక్కసారిగా ఎలా మాయమైంది, ఎక్కడికి వెళ్లింది, ఇక్కడ ఉన్నప్పుడు ఏ జంతువుపైనా దాడి చేసిన దాఖలాలు కూడా ఎందుకు లభించలేదు, తిరిగి చిరుత ఇక్కడికి వచ్చేందుకు అవకాశం ఉంటుందా అనే ప్రశ్నలకు మాత్రం సమాధానాలు దొరకడం లేదు.

మట్టి శివలింగాల తయారీ


ధవళేశ్వరంలో మట్టి శివలింగాలను తయారు చేస్తున్న భక్తులు

ధవళేశ్వరం: కైలాస వాసుని సేవలో ధవళేశ్వరంలోని భక్తులు పులకిస్తున్నారు. భోగలింగేశ్వర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి మట్టి శివలింగాల తయారీలో వీరు భాగస్వామ్యులయ్యారు. సాధనాల చంద్రశేఖర్ (శివ) ఆధ్వర్యంలో ధవళేశ్వరం గొల్లపేట రామాలయంలో గత నెల 18 నుంచి ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ బంకమట్టితో శివలింగాలను తయారుచేస్తున్నారు. ఇలా ఇప్పటివరకూ సుమారు 15 వేల శివలింగాలను భక్తులు మట్టితో తయారు చేశారని శివ తెలిపారు. దీనిలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు గొల్లపేట రామాలయం వద్దకు రావాలని కోరారు.

రేపు షాపులకు సెలవు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్ట ప్రకారం బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ది ఛాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలోని షాపులకు సెలవు ప్రకటించారు. వ్యాపారస్తులు తమ షాపులను మూసివేయాలని చాంబర్ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

అనువాదంతోనే సాహిత్య వికాసం


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సీటీఆర్ఐ: అనువాదంతోనే సాహిత్య వికాసం సాధ్యమని నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. ఎస్కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగుశాఖ, కళా గౌతమి సంయుక్త నిర్వహణలో సోమవారం అంతర్జాతీయ అనువాద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాభారతం మొదలు అనేక కావ్యాలు అనువాదంతోనే విశ్వవ్యాప్తం అయ్యాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ ఆధునిక కాలం అనువాద కాలమని శాస్త్ర, సాంకేతిక, సామాజిక, వినోద, ప్రసార ,రాజకీయ రంగాల్లో అనువాదరంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. భాషలో కొత్త సాంకేతిక ధోరణలు ప్రవేశిస్తున్నప్పుడు అందుకు అగుణంగా ప్రతి ఒక్కరు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో హితకారిణి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చీర్ల సీతారామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ సచివాలయం కార్యదర్శి మాకొద్దు

కడియం: కడియపులంక సచివాలయం – 2 కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కడియపులంక సర్పంచ్ పాతంశెట్టి వెంకట రామారావు (రాంజీ) సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ పర్వీన్ గత ఎన్నికల విధులలో అలసత్వం , నిర్లక్ష్య ధోరణిపై అప్పటి కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు విధుల నుంచి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అనంతరం జూన్ 13న సస్పెండ్ ఎత్తివేయడంతో మళ్లీ విధులకు హాజరైన పర్వీన్.. పంచాయతీ కార్యదర్శికిగానీ, సర్పంచ్ కు గానీ విధులకు హాజరవుతున్నట్లు, తన జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారన్నారు. సచివాలయానికి వెళుతున్న ప్రజాప్రతినిధులు, ప్రజలతో గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి జమ అయిన నిధులను డ్రా చేసి, వాటిని పంచాయతీ ఖాతాకు జమ చేయలేదన్నారు. ఆ నిధులపై పలుసార్లు వివరణ అడిగినా అతి నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు.

ఘనంగా వాసవి ఇంటర్నేషనల్ రీకాన్


చంద్రగుప్త చందూస్ దంపతులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వాసవీ ఇంటర్నేషనల్‌లో భాగమైన వి215ఏ డిస్ట్రిక్ట్ రీజియన్ 2 రీజనల్ చైర్మన్ చందోలు చంద్రగుప్త చందూస్ రీకాన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ వేదా మధుసూదన్ అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్‌లో సోమవారం నిర్వహించిన రీకాన్ కార్యక్రమంలో సభ్యులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రీకాన్ అంటే ఈ సంవత్సరంలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్లను గుర్తించి, వారికి ఘనంగా సత్కరించడమన్నారు. సమాజానికి పనికొచ్చే సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం జిల్లా గవర్నర్ గోల్డెన్ స్టార్ ఎస్.ప్రవీణ్ కుమార్, ఔట్ స్టాండింగ్ ప్రెసిడెంట్ అవార్డు గెలుచుకున్న రాజమహేంద్రవరం వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ రాయపూడి నాగసాయిలక్ష్మి, అవుట్ స్టాండింగ్ సెక్రటరీ అవార్డు గెలుచుకున్న వాసవీ క్లబ్ రాక్ కపుల్స్ సెక్రటరీ సంకసంతోషి, అవుట్ స్టాండింగ్ ట్రెజరర్ అవార్డు గెలుచుకున్న మల్లయ్యపేట ట్రెజరర్ చెక్క ఆదినారాయణను సత్కరించారు. కార్యక్రమంలో బోడ సాయి సూర్యప్రకాష్, వాసవి విధాత గ్రంధి సతీష్ చంద్రగుప్త, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారులను సత్కరించడం అందరి బాధ్యత


క్రీడాకారులను సత్కరిస్తున్న సోము వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను సత్కరించడం మనందరి బాధ్యత అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం క్రీడాకారులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో క్రికెట్, బ్యాడ్మింటన్, హాకీ, అథ్లెటిక్స్, ఇతర క్రీడల్లో దేశం బాగా రాణిస్తోందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రీడాకారులకు అన్ని విధాలా సహాయం అందిస్తుందన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ద్వారా పాఠశాల, కళాశాల స్థాయి నుంచి కబడ్డీ, ఇతర క్రీడల్లో రాణిస్తున్న వర్ధమాన క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న నగర క్రీడాకారులు ఎస్.హారిక, జి.మోజెస్, ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఎం.శ్రీలతను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, క్రికెట్ కోచ్ జె.హరినాథరెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కిషోర్ బాబు, ఫుట్‌బాల్ కోచ్ మణికంఠ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు మహోత్సవం


గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న ముజావర్ షేక్ అహ్మద్ వలీ

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు శాంతినగర్‌లోని హజరత్ సయ్యద్ కరీముల్లాషా ఖాదరీ ఉరుఫ్ కాలేషా పీర్ మస్తాన్ వలీ 32వ గంధోత్సవం ఉర్సు మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చందాసత్రం వీధిలోని ఖాజీ మసీదు దగ్గర షేక్ జలాలుద్దీన్ సాహెబ్ ఇంటి నుంచి గంధాన్ని ప్రత్యేక బిందెలలో నింపి, పూలమాలలతో అలంకరించారు. ముజావర్ షేక్ అహ్మద్ వలీ వాటిని తలపై పెట్టుకుని మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ కాతేరు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కాతేరు శాంతినగర్ ఆరో వీధిలోని పెద్దనుయ్యి వద్ద షేక్ అహ్మద్ వలీ ఇంటి ఆవరణ వరకూ వెళ్లి, అక్కడ ఫాతిహాఖాని నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ ప్రారంభం


బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి తదితరులు

సీటీఆర్ఐ: ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. 1997లో ప్రారంభించిన ట్రస్ట్ విద్య, వైద్యం, మంచినీటి సౌకర్యం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తోందని ఆమె తెలిపారు. స్థానిక ప్రకాశంనగర్‌లో గోరంట్ల శాంతారావు (జీఎస్సార్) మెమోరియల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో 'ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనేశ్వరి మాట్లాడుతూ హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతిలో బ్లడ్ బ్యాంకులు ఉన్నాయని నాలుగోది ఇక్కడ ప్రారంభించామన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీఎస్సార్ మెమోరియల్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వెంకట లక్ష్మి, ఎండీ డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో కొంతమూరు గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ సంజీవని ఉచిత ఆరోగ్యరథాన్ని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్టు, జీఎస్ఎల్ ఆసుపత్రి, గోరంట్ల శాంతారామ్ చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి ప్రారంభించారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, గన్ని కృష్ణ, మత్సేటి ప్రసాద్, దండమూడి ప్రసాద్, మజ్జి పద్మావతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు పూజలు

కొంతమూరు గ్రామంలో కొలువైన నూకాలమ్మ అమ్మవారిని నారా భువనేశ్వరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకుడు దండమూడి శ్రీహరి 164 కొబ్బరికాయలు కొట్టి నూకాలమ్మకు మొక్కు తీర్చుకున్నాడు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌పై సదస్సు


మాట్లాడుతున్న రిలయన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగేశ్వరరావు

కంబాలచెరువు: ఇంటర్‌లో 60 శాతం మార్కులు వచ్చిన విద్యార్థులకు రిలయన్స్ ఫౌండేషన్ తరఫున ఆన్‌లైన్ స్కాలర్ షిప్ పరీక్ష పెడుతున్నట్లు రిలయన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.నాగేశ్వరరావు తెలిపారు. ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ క్లియర్ గైడెన్స్, జేకేసీ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 50 వేలు చొప్పున అందజేస్తామని, దీనికి దేశవ్యాప్తంగా 5 వేల మందిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఫౌండేషన్ తరఫున ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారని, దానిలో ఇంగ్లిష్, ఇంగ్లిష్ న్యూమరికల్ వెర్బల్ ఉంటాయన్నారు. సభ అధ్యక్షుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఐపీఎస్సీ కో ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణ శ్రీ మాట్లాడుతూ కమ్యూనికేషన్, లైఫ్ స్కిల్స్‌పై పూర్తిస్థాయిలో పట్టుసాధించాలన్నారు. సదస్సులో మేడూరి లక్ష్మీనరసింహ, డాక్టర్ పీవీ సంజీవరావు, సోమశేఖర్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సాంఖ్యక శాస్త్ర విభాగ అధ్యాపకురాలు డి.మధులత పర్యవేక్షించారు.

2న లక్ష రుద్రాక్షల పూజ

సీటీఆర్ఐ: ఆర్యాపురంలోని కాల భైరవస్వామి క్షేత్రంలో బుధవారం వార్షిక లక్ష రుద్రాక్షల పూజ నిర్వహిస్తున్నట్టు లక్ష్మీకుబేర స్వర్ణాకర్షణ భైరవ క్షేత్రం నిర్వాహకుడు కాలభైరవ గురుస్వామి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఉదయం 4.30 గంటలకు లక్ష రుద్రాక్షలతో ప్రత్యేక పూజ, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం, 5:30 గంటలకు కాలభైరవ మహాచండీ హోమం జరుగుతుందన్నారు. పూజ, అభిషేకం, హోమం అనంతరం రుద్రాక్షలను భక్తులకు వితరణ చేస్తారన్నారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు భక్తులకు అన్నప్రసాదసేవ ప్రారంభమవుతుందని తెలిపారు. అలాగే 2వ తేదీన సంపూర్ణ సూర్య గ్రహణం అని విస్తృతంగా ప్రచారం జరుగుతోందని, వాస్తవానికి 2024, 2025 క్రోధి నామ సంవత్సరంలో ఎటువంటి గ్రహణాలు లేవని పంచాంగకర్తలు, పండితులు చెబుతున్నారన్నారు.

మహిళా కారాగారంలో వసతుల పరిశీలన



మాట్లాడుతున్న డీఎస్ఎల్ఏ కార్యదర్శి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు సందర్శించారు. అక్కడి ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. కారాగారంలోని ఖైదీలతో మాట్లాడారు. వారి తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు వేయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు. ఇందుకోసం సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ అర్జీలను అందించాలన్నారు. ముద్దాయిలు, ఖైదీల గురించి పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గౌతమి జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడి వసతులు, సదుపాయాలను పరిశీలించిన తరువాత పిల్లలు, వయోవృద్ధులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు, వయోవృద్ధులకు పోషక ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆశ్రమంలో ఎలాంటి అసౌకర్యం ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కంబాలచెరువు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొడేశ్వర్ నగర్‌కు చెందిన వి.వెంకటరాజు (37) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో గొడవలు రావడంతో తల్లి వద్దే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి యథాతథంగా నిద్రించిన వెంకటరాజు మర్నాడు ఉదయం ఎంతసేపటికీ తలుపు తీయలేదు. దీంతో తల్లి అచ్యుతమ్మ, చుట్టుపక్కల వారిని పిలిచింది. వారందరూ కలిసి తలుపు పగులకొట్టారు. లోపలికి వెళ్లి చూసేసరికి ఇంటిలో వెంకటరాజు ఉరివేసుకుని కనిపించాడు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. వెంకటరాజు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛత మన జీవితంలో భాగం కావాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

- మంత్రి కందుల దుర్గేష్
- ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

సీటీఆర్ఐ: స్వచ్ఛత మన జీవితంలో భాగం కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో సోమవారం స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతితో కలిసి మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21 వేల మందితో ఏర్పాటు చేసిన మానవహారం ఆకట్టుకుంది. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలందరూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ స్వచ్ఛతాహి కార్యక్రమంతో పాటుగా విజన్ 2047కి ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన గార్గ్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శానిటరీ సిబ్బంది, యువతతో కూడిన రికార్డు స్థాయిలో మానవ హారం కోసం పిలుపు నివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నరసింహ కిశోర్ పాల్గొన్నారు.


స్వచ్ఛతాహి సేవ ఆకారంలో విద్యార్థుల మానవహారం

పోలీసు అధికారులకు సత్కారం


ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు: పోలీసు డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన వారు ఎవరైనా డిపార్ట్‌మెంట్‌లో భాగస్వాములేనని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేసిన డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, ఏఎస్సై ఎ.భీమేశ్వరరావు, ఏఆర్ఎస్సై జి.సాయి రామకృష్ణ, హెచ్‌సీ ఎంవీ రమణను ఎస్పీ నరసింహ కిషోర్ ఘనంగా సన్మానించారు. వారికి జ్ఞాపికలు అందజేశారు. పోలీసు డిపార్టుమెంట్‌లో వీరు అందించిన సేవలను కొనియాడారు.

బస్ కాంప్లెక్స్ పరిశుభ్రం

కంబాలచెరువు: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం శ్రమదానం చేశారు. డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్లాస్టిక్, చెత్త, ఇతర వ్యర్థాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ షబ్నం, బి.జె.పి.కి.చెందిన మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, ఆదిత్య, రమేష్, జయదీప్ పాల్గొన్నారు. ఆదిత్య విద్యార్థుల సేవా కార్యక్రమాలను కార్యక్రమానికి వచ్చిన అతిథులు అభినందించారు.